# బుద్ధి, విజ్ఞానములకు అధిపతి గణపతి

ప్రేమస్వరూపులారా! ఈ ప్రాకృతమైన జగత్తునందు అన్నీ వస్తుంటాయి, పోతుంటాయి. ధనము లభిస్తుంది, ఖర్చైపోతుంది. మిత్రులు కలుస్తుంటారు. విడిపోతుంటారు. అయితే, ధనము పోయినా తిరిగి సంపాదించుకోవచ్చు; మిత్రుణ్ణి కోల్పోయినా మరొక మిత్రుణ్ణి పొందవచ్చు; భార్యను కోల్పోయినా మరొక వివాహమాడవచ్చు; భూమిని కోల్పోయినా తిరిగి సంపాదించుకోవచ్చు. కాని శరీరమునే కోల్పోతే తిరిగి సంపాదించుకోవటానికి వీలుకాదు. కనుక, మీరు శరీరమున్నంతలోనే మానవతా విలువలను పోషించుకొని మానవత్వాన్ని సార్థకం గావించుకోవాలి.

ఈ ప్రాకృతమైన జగత్తు అస్థిరమైనది. యౌవనము, ధనము కదలిపోయే మేఘాలవంటివి. దారాపుత్రాదులు, బంధుమిత్రాదులు కూడ అస్థిరమైనవారు. సత్యధర్మాలు మాత్రమే స్థిరమైనవి. ఏ లోకమునందైనా, ఏ జన్మమునందైనా, ఏనాటికైనా మానవుని వెంట ఉండేవి సత్యధర్మాలు మాత్రమే. ప్రాచీన కాలమునుండి భారతీయ సంస్కృతి సత్యధర్మాలనే ఆశ్రయించి ఉన్నది. సమస్త వేదశాస్త్రములు, పురాణములు, ఉపనిషత్తులు బోధించేవి ఈ రెండే – "సత్యం వద, ధర్మం చర." సత్యధర్మములను పోషించుకునే నిమిత్తం జన్మించిన మానవుడు ఇంద్రియాలకు బానిసయై, అనేక కష్టనష్టములకు గురియై సత్యధర్మాలను విస్మరిస్తున్నాడు. మానవత్వాన్ని ధరించియు మానవతా విలువలను పోషించుకొనలేకపోతున్నాడు. పుట్టటం, పెరగటం, సుఖాలను అనుభవించటం,మరణించటం – ఇంతేనా మానవ జీవిత లక్ష్యం? ఈ నాల్గు విధములైన స్థితులను పశుపక్షి మృగాదులుకూడా అనుభవిస్తూనే ఉన్నాయి. మానవుడు జన్మించినది వీటికోసం కాదు. తాను ప్రత్యేకమైన ఆదర్శాన్ని నిరూపించాలి. "ఉద్ధరే దాత్మనాత్మానమ్" ఆత్మోద్ధరణ కోసమే మానవత్వం ప్రాప్తించిందిగాని, కేవలం పశుపక్షిమృగాదులవలె జీవించే నిమిత్తం కాదు. ఇట్టి పవిత్రమైన విజ్ఞాన, సుజ్ఞాన, ప్రజ్ఞానములను బోధించే తత్త్వమే గణపతితత్త్వం. 'గ' అనగా బుద్ధి, 'ణ' అనగా విజ్ఞానము. ఈ రెండింటికీ అధిపతియైనవాడు గణపతి. సర్వగణములకు, సద్గుణములకు అధిపతి గణపతి. సురలోకమునకే అధిపతి గణపతి. అతడే సర్వులకూ లీడర్ (నాయకుడు). అతనిని మించిన నాయకుడు లేదు.

sri sathyasai vachanamrutam

ఇట్టి గణపతితత్త్వాన్ని మానవుడు అనుభవించాలి. వేదకాలమునుండి గణపతి తత్త్వమునుగూర్చి ప్రచార ప్రబోధలు జరుగుతూనే ఉన్నాయి. ఋగ్వేదము, తైత్తిరియోపనిషత్తుగూడా గణపతి తత్త్వాన్ని బోధించినాయి.

## దేహియే దేవదేవుడు

ప్రతి మానవునియందు గణపతితత్త్వం ప్రకాశిస్తూనే ఉంది, అంతర్వాణిగా ప్రబోధలు సల్పుతూనే ఉంది. ఇట్టి ప్రబోధలను మానవుడు విస్మరించి, దీనత్వం వహించి, మానవత్వాన్ని హీనపరచుకుంటున్నాడు. అనిత్యమైన, ప్రాకృతమైన వస్తువుల నిమిత్తమై ప్రాకులాడుతూ, అశాంతికి నిరాశానిస్పృహలకు గురి అవుతున్నాడు. మానవుడు సాధించవలసింది భౌతికమైన విద్య కాదు, లౌకికమైన శక్తి కాదు, ప్రాకృతమైన ఆనందము కాదు. ఇవన్నీ ప్రవత్తి మార్గానికి సంబంధించినవి. ప్రవృత్తి మార్గంలో లభించేవన్నీ అనిత్యములు, అశాశ్వతములే! వీటి నిమిత్తమై మానవుడు తన మానవతా విలువలను కోల్పోకూడదు. తాను నివృత్తినే ఆధారం చేసుకోవాలి గాని, ప్రవృత్తిని ప్రధానంగా తీసుకోకూడదు.

దేహము పాంచభౌతికము, దేహము కూలక తప్ప దెప్పుడున్
దేహి నిరామయుండు గణుతింపగ దేహికి చావు పుట్టుకల్
మోహ నిబంధ బంధనల ముద్రలు లేవు, నిజంబు చూడ యీ
దేహియె దేవదేవుడు, మదిన్ గణుతింపగ ఆత్మరూపుడౌ!

కాని ఈనాటి మానవుడు దేహమునే ప్రధానంగా తీసుకొని, దేహిని విస్మరించి, కాలాన్ని వ్యర్థం గావించుకుంటున్నాడు. కాలమును వ్యర్థం గావించుకున్న వ్యక్తి కాయము నేరీతిగా సార్థకం గావించుకోగలడు? వేదశాస్త్రేతిహాస పురాణములు మానవత్వాన్ని గొప్పగా వర్ణించాయి. మానవుడు వీటిని పఠిస్తూనే ఉన్నాడు. కాని, పఠించి ప్రయోజనమేమిటి? అర్థం చేసుకోగల్గుతున్నాడా? ఆచరణలో పెట్టకపోవటంచేతనే సార్థకతను పొందలేకపోతున్నాడు.

## వినాయకునికి పెట్టే నైవేద్యం - అంతరార్థం

వినాయకచవితి పర్వదినమున భారతీయులు కుడుములు, ఉండ్రాళ్ళు మొదలగు పిండి వంటలు చేసి గణపతికి నివేదన చేయటం కద్దు. దీనియొక్క అంతరార్థాన్ని మీరు గుర్తించాలి. బియ్యపుపిండి, నువ్వులపిండి, బెల్లము కలిపి, తైలము లేకుండా ఆవిరిపై ఉడికించి, వాటిని

sri sathyasai vahini

ఉండలుగా చేసి వినాయకునికి నైవేద్యం పెడుతున్నారు. నూనె లేకుండా ఆవిరిపై ఉడికిన పదార్థం ఆరోగ్యానికి ఎంతో మంచిది. ఇది కన్నులకు మంచి శక్తినిస్తుంది; ఆస్త్మా, ఇస్నోఫీలియా, ఉబ్బస వ్యాధులతో బాధపడేవారికి చాలామేలు చేస్తుంది. ఈవిధంగా, భగవత్సంబంధమైన ప్రతికార్యములోనూ ఒక అంతరార్థం ఉంటుంది. కాని, మానవుడు, ఈ సత్యాన్ని గుర్తించుకోలేకపోతున్నాడు.

**'అనిత్యం అసుఖం లోకం......'**

ప్రతి మానవునియందు పశులక్షణాలు, పశుపతిలక్షణాలు రెండూ ఉన్నవి. కాని మానవుడు పశుపతిలక్షణాలను విస్మరించి, పశులక్షణాలను అభివృద్ధిపరచుకుంటున్నాడు. పశు లక్షణాలు తలనుండి ప్రారంభమౌతాయి. పశుపతి లక్షణాలు హృదయమునుండి ఆవిర్భవిస్తాయి. ఈనాటి చదువులుగాని, తెలివితేటలుగాని తలనుండి ప్రారంభమైనవే. ఈనాడు ఏ సైంటిస్టు అయినా తలనుండి ప్రారంభమైన మేధాశక్తినే అనుసరిస్తున్నాడు. మేధాశక్తి ప్రవృత్తి సంబంధమైనది. హృదయంనుండి ఆవిర్భవించే దయ, ప్రేమ, సత్యము, సహనము, సానుభూతి ఇత్యాది సద్గుణాలు నివృత్తికి సంబంధించినవి. ఈనాటి మానవుడు ప్రవృత్తికి సంబంధించిన తెలివితేటలనుమాత్రమే పెంచు కుంటున్నాడుగాని, నివృత్తిలక్షణాలను అభివృద్ధిపరచుకోవటం లేదు. "అనిత్యం అసుఖం లోక మిమం ప్రాప్య భజస్వ మాం" అన్నాడు గీతాచార్యుడు. ఈ లోకమునందు సుఖము లేదు, శాంతి లేదు, ఆనందము లేదు. కనుకనే, భగవంతుణ్ణి భజించాలి. ప్రవృత్తిమార్గమును విసర్జించి, నివృత్తిమార్గంలో ప్రవేశించాలి. అప్పుడే మానవ జన్మ సార్థకమౌతుంది. కాని ఈనాడు పెద్దలైనవారుకూడా పిల్లలకు లోకసంబంధమైన విషయాలనే బోధిస్తున్నారుగాని, హృదయతత్వాన్ని బోధించటంలేదు. లోకసంబంధమైన విషయాలను అనుభవించటంలో గొప్పతనమేమున్నది? మానవుడు పుట్టినది మొదలు చచ్చేంతవరకు వీటిని అనుభవిస్తూనే ఉన్నాడు. ఇందులో ఏకించిత్తైనా శాంతిని పొందుతున్నాడా? లేదు. అసలు శాంతి ఎక్కడుంది?

హస్తమున అణుబాంబు ఉంచుక
అరుచుచుందురు శాంతి శాంతియని
చంద్రు చేరగగల్గి కూడను
చెందజాలరు శాంతిసుఖములు

sri sathyasaivachanamrutam

ఈ ప్రాకృతమైన శాంతి, శాంతి కాదు. పరతత్త్వంతో కూడిన శాంతియే సత్యమైన శాంతి. అట్టి శాంతికోసం మానవుడు బయటి ప్రపంచంలో వెతుకనక్కర్లేదు. బయట ఉన్నదంతా అశాంతియే. శాంతి తనయందే ఉన్నది. శాంతియే తన స్వరూపం. "ఏకాత్మా సర్వభూతాంతరాత్మ" అన్న సత్యాన్ని గుర్తించినప్పుడే నిరంతరము శాంతిసుఖములతో జీవించగలడు. 'పరులు పరులుకాదు, పరమాత్మస్వరూపులే' అన్న సత్యాన్ని గుర్తించాలి. పక్షపాతబుద్ధితో ఒకరిని ప్రోత్సహించటం, ఒకరిని ద్వేషించటం తగదు.

**పూజలు వ్రతములు చిత్తశుద్ధికోసమే**

ప్రేమస్వరూపులారా! స్వామియొక్క దేహానికి 75 వ సంవత్సరం వస్తోందని బెంగుళూరుకు చెందిన భక్తులు 750 గణపతులను తెప్పించి పూజలు చేస్తున్నారు. 750 గణపతులను తెచ్చి పెట్టినా, 7 కోట్ల గణపతులను తెచ్చిపెట్టినా గణపతి ఒక్కడే. చిత్తశుద్ధి లేనప్పుడు ఎన్ని గణపతులను తెచ్చి పూజించినా ప్రయోజనం లేదు. ఏకాత్మభావంతో ఒక్క గణపతిని పూజించినా చాలు. ఈ పూజలు, వ్రతములు దేనికోసం? "చిత్తస్య శుద్ధయే కర్మ" ఇవన్నీ చిత్తశుద్ధికోసం ఏర్పడినవే. మైసూర్‌పాక్, గులాబ్‌జామ్ మున్నగు స్వీట్స్‌లో ఉన్న చక్కెర ఒకటే కదా! అదేవిధంగా శ్రవణం, కీర్తనం, విష్ణుఃస్మరణం, పాదసేవనం, వందనం, అర్చనం, దాస్యం, స్నేహమాత్మనివేదనం అనే నవవిధ భక్తి మార్గములందు అంతర్వాహినిగా ఉండేది ప్రేమ ఒక్కటే. కనుక ప్రేమతత్వాన్ని అనుసరించండి. అదియే సరియైన సాధన.

**భగవదర్పితమైన కర్మయే సార్థకం**

ఏ కర్మనైనా ప్రారంభించేముందు దానిని భగవంతునికి అర్పితం చేయాలని పవిత్రమైన మన ప్రాచీన సంస్కృతి బోధిస్తున్నది. కనుకనే లారీడ్రైవరు తన సీటులో కూర్చునే ముందుగా స్టీరింగుకు నమస్కారం చేస్తాడు; నర్తకి కాలి అందెలను ధరించేముందు వాటిని కళ్ళకద్దుకుంటుంది. భగవద్గీతను పారాయణం చేసే వ్యక్తి మొట్టమొదట ఆ గ్రంథానికి నమస్కరిస్తాడు. దీని అంతరార్థమేమిటి? "నేను చేయబోయే కర్మ సార్థకమైనదిగా ఉండాలి" అనే భావముతో మొట్టమొదట కర్మకు నమస్కరించాలి. నిరక్షరాస్యుడైన లారీ డ్రైవరుకూడ ఎంతో భయభక్తులతో స్టీరింగుకు నమస్కారం చేస్తాడు. కాని విజ్ఞానవంతుడైన సైంటిస్టుకు మాత్రం ఈ జ్ఞానం లేకపోతున్నది. అహంకారమే దీనికి మూలకారణం. ఎవడు జ్ఞానినని

sri sathyasai vahini amrutam

భావిస్తాడో వాడే పరమ అజ్ఞాని. మనిషి నడుస్తుంటే అతని నీడకూడా ప్రక్కనే నడుస్తూ వస్తుంది కదా! అదేరీతిగా "నేను గొప్ప జ్ఞానిని" అనుకునేవానిని అజ్ఞానమనే నీడ వెంటాడుతూనే ఉంటుంది. దీనినుండి తప్పించుకోవాలంటే "సర్వం విష్ణుమయం జగత్" అని భావించాలి. ఇదే ఉపనిషత్తులు బోధించినది. అంతా దైవస్వరూపమే. దీనిని పురస్కరించుకొనియే త్యాగరాజు "చీమలో బ్రహ్మలో శివకేశవాదులలో ప్రేమమీర వెలసియుండే బిరుదు వహించిన రామ నన్ను బ్రోవరా!" అన్నాడు. చీమమొదలు బ్రహ్మవరకు సర్వత్ర దైవత్వమే నిండియున్నది. అలాంటి దైవత్వాన్ని ఎలా మరచిపోతున్నారు? ఇది ఆధునిక విద్యల ప్రభావమే.

**మనస్సు భగవన్మయం కావాలి.**

ప్రేమస్వరూపులారా! మీరు భజనలు చేస్తున్నారు. కాని దేని నిమిత్తమై చేస్తున్నామనేది మీరు గుర్తించటంలేదు. కొంతమందికి భజన చేసే సమయంలో శ్రుతిలయరాగములపై మనస్సు పోతుంటాది. శ్రుతిలయరాగములుకూడా ఉండవలసిందే. కాని, వాటిపైనే దృష్టి పెడితే భావము పాడైపోతుంది. నిజంగా భగవత్ప్రేమను మీ హృదయంలో నింపుకున్నప్పుడు శ్రుతిలయరాగములు ఆటోమేటిక్‌గా సరిపోతాయి. అగ్నిలో పారవేసిన ఇనుపముక్క పూర్తి అగ్నిగానే మారినట్లు, మీ మనస్సు పూర్తి భగవన్మయం కావాలి. పాలను, నీటిని విడదీయటానికి వీలుకాదు. అదే రీతిగా మీరు భగవంతునితో ఏకం కావాలి. అనేకత్వంలోని ఏకత్వం గుర్తించాలి. అట్టివాడే నిజమైన మానవుడు. ఏదో పండుగ రోజుల్లో భగవంతుని పూజిస్తే సరిపోదు. ప్రతి క్షణమూ దైవప్రార్థన చేయాలి. అలా చేస్తే మా పనులెలా జరుగుతాయని మీరు సందేహిస్తారేమో! మీపని వేరు, దైవం పని వేరా? కాదు, కాదు. ఈవిధంగా విభజించుకోకూడదు. మీరు వేరు, దైవము వేరు కాదు. కాబట్టి మీపని, దైవం పని ఒక్కటే. పూజగదిలో చేసే ప్రార్థన భగవంతుని పనియని, బయట చేసే పనులు మీ పనులని భావించటం చాలా పొరపాటు. కొంతమంది పూజగదిలోకి ప్రవేశించినంత వరకు ప్రాకృతమైన భావాలతో ఉంటారు; పూజగదిలోకి పోతూనే తలుపులు వేసుకొని భగవత్ప్రార్థన చేస్తారు. ఇట్టి భేదభావాన్ని దూరం చేసుకోవాలి. "నా హృదయమే భగవంతుని మందిరం" అన్న సత్యాన్ని గుర్తించి వర్తించువాడే నిజమైన వ్యక్తి. హృదయంలో దైవాన్ని ప్రతిష్ఠించుకొని ఏ కార్యం చేసినా అది దైవకార్యంగానే రూపొందుతుంది.

sri sathyasai vachanamrutam

## భగవంతుడు భావప్రియుడు

ప్రేమస్వరూపులారా! ప్రతి దినమునూ ఒక పవిత్ర దినముగానే భావించాలి. దైవచింతన చేయాలంటే వినాయక చవితి, నవరాత్రి ఉత్సవాలకోసం కాచుకోనక్కర్లేదు. ప్రతిక్షణమూ దైవస్వరూపమే. కాని ఇట్టి దైవత్వాన్ని మీరు విస్మరిస్తున్నారు. మీరు ఎందరినో ప్రేమిస్తున్నామని భావిస్తున్నారు. కాని, ఈ ప్రేమ క్షణభంగురమైనది. దీనినసలు ప్రేమ అని పిలువకూడదు; ఇది కేవలం 'అటాచ్‌మెంట్' మాత్రమే. దైవాన్ని నిర్మలంగా, నిశ్చలంగా, నిస్వార్థంగా ప్రేమించటమే నిజమైన ప్రేమ. "నేను స్వామి భక్తుడను" అనుకున్నప్పుడు స్వామి ఆదేశాలకు తగినట్లుగా ప్రవర్తించాలి. రెండు మూటల బియ్యంతో పులిహోర చేసి పేదలకు పంచిపెట్టానని, 500 పంచెలు, చీరలు దానం చేశానని లెక్కలు వేయవద్దు. ఈ లెక్కలను కావాలంటే ఇన్‌కమ్‌ట్యాక్స్ ఆఫీసర్‌కు చెప్పుకోవాలిగాని, భగవంతుని దగ్గర చెప్పటానికి వీల్లేదు. మీరు ఏ భావంతో చేస్తున్నారనేది మాత్రమే భగవంతుడు చూస్తాడు. పవిత్రమైన హృదయంతో ఏ కించిత్తు పెట్టినా అది బ్రహ్మాండమైనదిగా మారిపోతుంది. "గంగిగోవు పాలు గరిటడైనను చాలు, కడివెడైన నేమి ఖరము పాలు?" భగవంతుడు మీ చిత్తశుద్ధినే చూస్తాడు; మీ హృదయ భావమునే పరిశీలిస్తాడు. ఈ పరిశీలనలో భగవంతునికి సాటి ఎవరూ లేరు.

## దైవేచ్ఛను అనుసరించాలి

ప్రేమస్వరూపులారా! అనేకమంది విద్యార్థులు ఈనాడు వినాయకపూజ చేసి, తాము గొప్ప విద్యావంతులు కావాలని, గొప్ప పేరు పొందాలని ఆశిస్తున్నారు. కాని మంచి బుద్ధి, జ్ఞానము, మంచి నడత ఎవ్వరూ కోరటం లేదు. ఏ చిన్నపనైనా ప్రారంభించటానికి ముందు "దీనిని భగవంతుడు మెచ్చుకుంటాడా, లేదా, ఇది భగవంతుని కిష్టమైన పనియా, కాదా" అని విచారణ చేయాలి. భగవంతునికి ప్రీతికరమైన ఏ కార్యంలో ప్రవేశించినా మానవుడు తప్పక విజయం సాధించగలడు. కాని ఈనాటి మానవుడు తన ఇష్టమును మాత్రమే అనుసరిస్తూ స్వార్థపరునిగా మారిపోతున్నాడు. స్వార్థ ప్రయోజనాలను ప్రక్కకు పెట్టి దైవేచ్ఛను అనుసరించాలి. హృదయ పూర్వకంగా భగవంతుణ్ణి ప్రేమించి, ప్రార్థించి, సర్వకార్యములనూ భగవంతునికి అంకితం చేయాలి. అప్పుడే స్వల్పకార్యంకూడా గొప్పదిగా రూపొందుతుంది. దివ్యత్వాన్ని అనుభవించాలంటే బుద్ధి, సిద్ధి రెండూ ఉండాలి. గణపతి బుద్ధి, సిద్ధి ప్రదాత. మంచిబుద్ధి

sri sathyasai vacharamrutham

ఉన్నప్పుడే సిద్ధి చేకూరుతుంది. భారతీయులు గణపతి పూజకు చాలా ప్రాముఖ్యత నిస్తారు. అయితే, గణపతి మీ హృదయ స్థాయినుండియే ప్రకాశిస్తూ ఉన్నాడు. భగవంతుడనగా ఎవరు? భ - అంటే ప్రకాశము. కాబట్టి సర్వత్ర ప్రకాశించేవాడే భగవంతుడు. అట్టి భగవంతుణ్ణి హృదయంలోనే ఉంచుకొని బయట వెతకటమెందుకు? భగవంతుణ్ణి దర్శించాలంటే హృదయాన్నే పరిశీలన చేసుకోవాలి.

**నిస్వార్థ సేవకు తగిన ఫలితం**

ప్రేమస్వరూపులైన విద్యార్థులారా! విద్యార్థినులారా! దైవత్వాన్ని పొందాలనుకుంటే ఒక్క నిర్మలమైన ప్రేమ చాలు. అష్టోత్తరశతనామాలు. సహస్రనామాలను పారాయణ చేయనక్కర్లేదు. ముక్తి తపస్సుచేత, తీర్థయాత్రలచేత, శాస్త్ర శ్రవణం చేత లభించేది కాదు. సజ్జనుల సేవ చేయాలి. ఎవరికి సేవ చేస్తున్నా దైవానికే చేస్తున్నట్లుగా భావించాలి. మీరు ఆఫీసుకు వెళ్ళే సమయంలో దారిలో ఎవరైనా ఏదైన ప్రమాదంలో చిక్కుకుంటే అవసరమైతే మీరు ఆఫీసుకు పోవటం మానివేసి వారికి తగిన సహాయం చేయాలి.

ఒక చిన్న ఉదాహరణ: ఒక ఢిల్లీ అబ్బాయి స్వామి బోధనలను విని ప్రభావితుడైనాడు. ఒకనాడు అతడు కాలేజీకి వెళుతున్నాడు. ఎనిమిది గంటలకు పరీక్ష ఉంది. దారిలో ఒక భిక్షగాడు నడవలేక క్రింద పడిపోవటం చూశాడు. వెంటనే అతనికి తగిన సపర్యలు చేసి, నెమ్మదిగా లేవదీసి హాస్పిటల్‌కు తీసుకువెళ్ళాడు. అప్పటికే పదిగంటలు దాటింది. అప్పుడు టైమ్ చూసుకుని "అయ్యో, ఈ పొద్దు పరీక్షకు పోవుటకు వీలుకాదే! అయినా ఫరవాలేదు. ఇదే నాకు భగవంతుడు పెట్టిన పరీక్ష" అనుకున్నాడు. పరీక్షపోయిందనే బాధ లేదతనికి. తరువాత నాదగ్గరికి వచ్చాడు. "స్వామీ ! ఒక్క పేపరు పోయింది. అయినా నాకు బాధ లేదు . ఎందుకంటే మీరు పెట్టిన పరీక్షలో నేను పాసైనాను" అన్నాడు. "నీ పరీక్షలో కూడా నీవు పాసైనావు నాయనా!" అన్నాను. ఒక నెల తరువాత పరీక్షా ఫలితాలు ప్రకటించబడినాయి. అతడు ఫస్ట్‌క్లాసులో పాసైనాడు! అతడు హృదయపూర్వకంగా చేసిన సేవకు తగిన ఫలితం లభించింది. ఎవరి మనస్సుకు వారు సాక్షి. "అయ్యో, నేను ఇతనికి సేవ చేస్తూ ఉంటే పరీక్షలో ఫెయిలౌతానే!' అని బాధ పడలేదు. ఆ పరీక్షలో పాస్ కాకపోయినా స్వామి పెట్టిన పరీక్షలో పాసైనానని తృప్తిపడ్డాడు. కనుక, ఏపనిచేసినా అది భగవత్సేవగా

భావించి చేయాలి. అప్పుడు మీకు ఏమాత్రమూ నష్టం రాదు; ఎప్పుడూ అపజయం పొందరు. తప్పక విజయం సాధిస్తారు.

## దైవానికి అర్పించవలసిన పుష్పాలు

చాలామంది పూజలే ప్రధానమనుకొని మిగిలిన అన్ని పనులూ మానుకుంటారు. ఇది చాలా పొరపాటు. పూజలు ప్రధానమే. అయితే, ఏది పూజ? మార్కెట్‌నుండి తెచ్చిన పూలను అర్పించటమా? కాదు, కాదు, మీ హృదయపుష్పాన్ని భగవంతునికి అర్పించాలి.

అహింసా ప్రథమం పుష్పం పుష్పమింద్రియనిగ్రహం
సర్వభూత దయాపుష్పం క్షమాపుష్పం విశేషతః
శాంతిపుష్పం తపఃపుష్పం ధ్యానపుష్పం తథైవచ
సత్య మష్టవిధం పుష్పం విష్ణోః ప్రీతికరం భవేత్

అన్నిటికంటే ముఖ్యమైనది క్షమాపుష్పం. ఈ క్షమను కల్గియుండటంచేతనే ధర్మజుడు అన్ని కష్టములకూ, నష్టములకు తట్టుకుని కట్టకడపటికి విజయం సాధించాడు. నిండుసభలో ద్రౌపదికి అవమానం జరుగుతుంటే ధర్మజుడు కళ్ళుమూసుకుని కృష్ణుని ధ్యానించటం చూసి భీముడు కోపోద్రిక్తుడైనాడు. "అన్నా! మొదటి నుండి ధర్మము, ధర్మము అని మమ్మల్ని కష్టాలపాలు చేశావు. నీవనుసరించిన ధర్మమే మన కష్టాలకు మూలకారణమైంది. ఇక నీ ధర్మాన్ని కట్టిపెట్టి నా ధర్మాన్ని అనుసరించు" అన్నాడు. ధర్మజుడు "నాయనా! ధర్మము ఒక్కటే. నీ ధర్మము, నా ధర్మము అని ప్రత్యేకించి లేదు. హృదయం మెచ్చిన ధర్మమే నిజమైన ధర్మము. అంతరాత్మను తృప్తిపరచినదే నిజమైన ధర్మము" అన్నాడు. అప్పుడు భీముడు "అన్నా! ద్రౌపదికి ఇంత పరాభవం జరుగుతుంటే కన్నులుమూసుకొని ఎలా కూర్చోగలుగుతున్నావు? నేను భరించలేను. ఇప్పుడే ఈ దుర్మార్గుణ్ణి చీల్చి చెండాడుతాను" అని లేచాడు. కాని, ధర్మజుడు అతనిని అడ్డుకొని శాంతింపజేశాడు. సరే, చివరికి ఏమైంది? ధర్మజుని ఆజ్ఞప్రకారం నడుచుకోవటంచేత పాండవులకే విజయం చేకూరింది.

sri sathyasai vachanamrutam

## ద్రౌపది క్షమాగుణం

అశ్వత్థామ ఉపపాండవుల గొంతులు కోసినప్పుడు అర్జునుడు అతనిని బంధించి తెచ్చి "ద్రౌపదీ! నీ కుమారులను చంపిన ఈ దుర్మార్గుని గొంతుకోస్తాను. వీని రక్తముతో తలంటుకొని స్నానం చేయి" అన్నాడు. అప్పుడు ద్రౌపది "అర్జునా! అశ్వత్థామ నా కుమారులను చంపినందుకు నేనెంతగా దుఃఖిస్తున్నానో, నీవిప్పుడు అశ్వత్థామను చంపితే అతని తల్లికూడా అంతగా దుఃఖిస్తుంది కదా! కాబట్టి, నీవీ పనికి పూనుకోవద్దు" అని వేడుకొన్నది. అంతేగాక అశ్వత్థామ పాదాలపై పడి "నా కుమారులు పసిపిల్లలు, నీకెట్టి ద్రోహమూ తలపెట్టనివారు. అలాంటివారిని చంపటానికి నీకు చేతులెలా వచ్చినాయి తండ్రీ?" అన్నదేగాని, పరుషవాక్యము లాడలేదు. అట్టి శాంతము, సహనభావమే ఆమెను అన్ని విధాలుగా సంరక్షిస్తూ వచ్చింది. కష్టసమయములందుకూడా మానవుడు శాంతం వహించాలి. ద్రౌపదికి ఇంతటి క్షమాగుణం కృష్ణుని ప్రబోధవల్లనే చేకూరింది. ఎలాంటి పరిస్థితియందైనా ఆమె కృష్ణుని మాటను జవదాటేది కాదు. ఇలాంటి పరమ భక్తులు, పతివ్రతామతల్లులవల్లనే భారతదేశం ఈనాటికీ సుక్షేమాన్ని అనుభవిస్తోంది.

**(1-9-2000) ఉదయం సాయికుల్వంత్ సభామండపంలో శ్రీవారు అనుగ్రహించిన దివ్య సందేశము)**

sri sathyasai vachanamrutam